
మనసంతా.. రామ్‌లల్లా..



ఉప్పల్ నియోజకవర్గమంతా రామమయం.. ఏ గుడి చూసినా, వీధి చూసినా, ఏ అపార్టుమెంట్లో అయినా దాదాపు అన్ని ప్రాంతాల్లో ఎక్కడ చూసినా శ్రీరామ నామ జపంతో మార్మోగింది. ప్రధాన రహదారులపై ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అన్నదానాలు, వీధుల్లో రాముడి పాటలతో మనసు పులకరించిపోయింది. ప్రధాన వీధుల్లో పెద్దఎత్తున ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అయోధ్యలో శ్రీరామ మందిర ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఉప్పల్‌లో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఉప్పల్ ఎన్‌జీఆర్ఐ అభయాంజనేయ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్‌తో కలిసి స్వామికి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోడుప్పల్, మేడిపల్లి, కుషాయిగూడ, మల్లాపూర్, కాప్రా, రామంతాపూర్, హబ్సిగూడ, నాచారం తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున పూజలు నిర్వహించారు.

– ఉప్పల్ జోన్ బృందం



ఉప్పల్‌లో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు



ఉప్పల్‌లో పూజల్లో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు



రామంతాపూర్ సత్యనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యక్ష ప్రసారం వీక్షిస్తూ..



శ్రీరామచంద్రమూర్తి ప్రత్యేక పూజల్లో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్



లక్ష్మీనారాయణ కాలనీలోని రామాలయంలో పూజల్లో కాంగ్రెస్ ఉప్పల్ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి



బోడుప్పల్ లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ర్యాలీ



కుషాయిగూడలో బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో..



మల్కాజిగిరి చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు



కుషాయిగూడలోని నలంద గ్రామర్ స్కూల్‌లో కరస్పాండెంట్ లక్ష్మారెడ్డి



అభయాంజనేయస్వామి ఆలయంలో పూజల్లో మల్లాపూర్ కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి



మల్లాపూర్‌లో బైక్ ర్యాలీ



పీర్జాదిగూడలో పూజలు నిర్వహిస్తున్న మేయర్ జక్క వెంకట్‌రెడ్డి



అల్వాల్‌లో పూజల్లో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ శాంతి



మచ్చబొల్లారంలో మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్



పూజల్లో సఫిల్‌గూడ లక్ష్మీ రెసిడెన్సీ వాసులు



అల్వాల్ రాజీవ్‌గాంధీ సర్కిల్ వద్ద అన్నదానంలో జంగి వేణు, లక్ష్మణ్



గౌతంనగర్ జయగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో అన్నదానం



మౌలాలి భరత్‌నగర్ పెరుమాళ్ల ఆంజనేయ స్వామి ఆలయంలో ...



డిఫెన్స్ కాలనీ నార్త్ పార్కు జైశ్రీరామ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



నార్త్ పార్కు షటిల్ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు



ఈస్ట్ ఆనంద్‌బాగ్‌లో ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్



శివపురికాలనీలో మాజీ ఎమ్మెల్యే రాంచందర్‌రావు

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: నాచారం 11 కేవీ ఇండోర్ సురానా ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ నాగరాజు తెలిపారు. సుప్రభాత్ స్కూల్, బాబానగర్, ఐస్ ఫ్యాక్టరీ, సురానా ఇండస్ట్రీస్, అకాడమీక్ స్కూల్ ఏరియా వరకు, చందమామా ఫీడర్ పరిధిలోని రోడ్ నెంబర్–09, 10, భాగ్యనగర్ ఫీడర్ పరిధిలోని నాచారం ప్రధాన రహదారి, డిల్లీ పబ్లిక్ స్కూల్, సింగం చెరువు తండా, మల్టీస్టీల్ ఫీడర్ పరిధిలోని ఐడీఏ నాచారం రోడ్ నంబర్7, 8లలో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

పాఠశాలల్లో మరమ్మతులు.. అభినందనీయం



నాచారం వెస్లీ స్కూల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: నాచారం గవర్నమెంట్ వెస్లీ హైస్కూల్‌కు రూ.6 లక్షల సొంత డబ్బులతో మరమ్మతులు చేయించిన దాచేపల్లి ధనలక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శరత్‌బాబును ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అభినందించారు. పాఠశాలను చారిటబుల్ సభ్యులతో కలిసి సోమవారం పాఠశాలను ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేపట్టాలని సూచించారు. బీఆర్ఎస్ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్, మల్లికార్జున్‌గౌడ్, ముత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యనగర్ కాలనీ కమాన్ ఏర్పాటు



బోడుప్పల్: 15వ డివిజన్ పరిధిలోని అయోధ్యనగర్ కాలనీ కమాన్‌ను సోమవారం డివిజన్ ఇన్‌చార్జి సిగురు రేణుక రవికుమార్ సొంత నిధులు రూ.2 లక్షలతో ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసుల అభ్యర్థన మేరకు కమాన్‌ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, అయోధ్యనగర్ కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు పూర్ణచందర్‌రావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటే లక్ష్యం



నరేందర్‌రెడ్డిని కలిసిన పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్: రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారుడిగా నియమితులైన వేం.నరేందర్‌రెడ్డిని ఆయన నివాసంలో సోమవారం ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలకు నాయకులు, నేతలు సిద్ధం కావాలని కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆయన సూచించినట్లు తెలిపారు.

తండ్రీ కొడుకుల మధ్య ఘర్షణ

- బయటకొచ్చిన గన్ వ్యవహారం
- తండ్రిని కాల్చేందుకు యత్నం
- తండ్రీకొడుకులకు రిమాండ్

అల్వాల్: తండ్రీకొడుకుల మధ్య జరిగిన ఘర్షణతో ఓ గన్ బయటపడిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్‌లో నివసించే టోనీ థామస్ ఆర్మీ రిటైర్డ్ ఉద్యోగి. సెక్యూరిటీ ఉద్యోగం చేసుకోవడానికి థామస్ లైసెన్స్ డబుల్ బ్యారల్ టువల్ బోర్ గన్‌ను తీసుకున్నాడు. గన్ రెన్యూవల్ గడువు 2014లో ముగియగా అప్పటి నుంచి దాన్ని ప్రభుత్వానికి సరెండర్ చేయకుండా ఇంటి వద్దే ఉంచుకున్నాడు. థామస్ కుమారుడు డోమ్(30) డ్రగ్స్‌కు అలవాటుపడి ఇంట్లో నిత్యం గొడవలు చేసేవాడు. దీంతో కుటుంబసభ్యులు డోమ్‌ను రెండు నెలల క్రితం రిహాబిలిటేషన్‌లో చేర్పించారు. రెండు రోజుల క్రితం అతడు బయటకు వచ్చి ఆదివారం రాత్రి తండ్రితో తీవ్ర ఘర్షణకు దిగాడు. మత్తులో ఉన్న డోమ్ ఇంట్లో ఉన్న గన్ తీసి తండ్రి థామస్‌పై కాల్చే ప్రయత్నం చేశాడు. దీంతో వెంటనే థామస్ భార్య 100కు ఫోన్ చేయడంతో పోలీసులు థామస్ ఇంటికి వచ్చి తండ్రీ కొడుకులను అరెస్ట్ చేశారు. గన్‌ను రెన్యూవల్ చేయకుండా అక్రమ ఆయుధం కలిగి ఉన్నందున థామస్‌ను, తండ్రిపై దాడి చేసినందుకు కొడుకు డోమ్‌ను సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

నేడు జెడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం

సాక్షి, మేడ్చల్ జిల్లా: కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ప్రథమంగా మేడ్చల్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం జరిగే మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆరు గ్యారంటీలపై వాడీవేడి చర్చ జరగనుంది. అలాగే, అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి చేరడంతో.. విపక్షంగా ఉన్న బీఆర్ఎస్ సభ్యులు ఆరు గ్యారంటీల దరఖాస్తుల ప్రగతి.. అమలుపై కూడా సమావేశంలో ప్రస్తావించేందుకు సన్నద్ధమవుతున్నారు.

ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇవ్వాలి

మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రజావాణిలో ప్రజలు అందించే ఫిర్యాదులు, అర్జీలను పరిష్కరించడానికి ప్రాధాన్యం ఇవ్వాలని, ఈ విషయంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు ఉంటాయని జిల్లా కలెక్టర్ గౌతమ్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలోని ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియలతో కలిసి ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంతో దూరం నుంచి వ్యయప్రయాసాలకోర్చి వస్తుంటారని, దీన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీలు, దరఖాస్తులు, ఫిర్యాదులను అవసరమైతే వెంటనే పరిష్కరించాలని సూచించారు. రాష్ట్రస్థాయి నుంచి వచ్చే ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇస్తూ.. వాటిని పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు. ప్రజావాణిలో ప్రజల వద్ద నుంచి 77 ఫిర్యాదులు కలెక్టర్‌తో సహా సంబంధిత అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ తప్పనిసరి



లైసెన్స్ ఫీజు తీసుకుంటున్న డీసీ

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో వ్యాపారాలు నిర్వహించే వారు తప్పని సరిగా ఈ నెల 31వ తేదీలోపు రెన్యూవల్ చేసుకోవాలని ఉప కమిషనర్ జి.రాజు తెలిపారు. నాచారంలో(మల్కాజిగిరి సర్కిల్ పరిధి) ఉన్న వోయిత్ టర్బో కంపెనీ నిర్వాహకులు రెన్యూవల్ కోసం రూ.6,57,010 చెల్లించారని ఆయన తెలిపారు. జనవరి నెల తర్వాత అపరాధ రుసుంతో చెల్లించాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చెల్లించని వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. లేనివారు కొత్తగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

కుషాయిగూడ: తప్పిపోయిన ఓ చిన్నారిని చర్లపల్లి పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన రంజిత్, జ్యోతి దంపతులు బతుకుదెరువు కోసం వచ్చి చర్లపల్లి పారిశ్రామికవాడలో కూలీగా పనిచేసుకుంటున్నారు. వారికి అర్చన(7) వయసు కలిగిన కూతురు ఉంది. సోమవారం దారి తప్పిన చిన్నారి సురాన చౌరస్తాలో ఏడ్చుకుంటూ కూర్చుంది. స్థానికులు పోలీసులకు సమాచారం అందజేయడంతో పోలీసులు చిన్నారిని స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఫొటోను వాట్సాప్ గ్రూప్‌లలో షేర్ చేయగా పలువురు చిన్నారి తల్లిదండ్రులకు తెలిపారు. వారు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లడంతో కథ సుఖాంతమయ్యింది. పోలీసులు తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేసి చిన్నారిని అప్పగించారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



హబ్సిగూడలో క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ వీధి నంబర్–8లో ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలోని ఐదు డివిజన్లు అయిన హబ్సిగూడ, ఉప్పల్, రామంతాపూర్, చిలుకానగర్, నాచారం డివిజన్ల ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే ఈ కార్యాలయాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు బన్నాల గీతప్రవీణ్‌ముదిరాజ్, శాంతిసాయిజెన్‌శేఖర్, మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్ననాగేశ్వర్‌రావు, బీఆర్ఎస్ డివిజన్ల అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు కృషి



హబ్సిగూడలో సీఐఎస్‌సీఈ బోర్డును రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

హబ్సిగూడ: విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దేందుకు విద్యాసంస్థలు కృషి చేయాలని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. హబ్సిగూడ రవీంద్రనగర్‌లో నిర్మించిన కౌన్సిల్ ఫర్ ది ఇండియన్ స్కూల్ సర్టిఫికేట్ ఎగ్జామినేషన్స్(సీఐఎస్‌సీఈ) నేషనల్ ఎడ్యుకేషన్ బోర్డును సోమవారం కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి వెలిగించి చేసి ప్రారంభించారు. అనంతరం సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 12 రాష్ట్రాలకు చెందిన సెంట్రల్ సిలబస్ విద్యాసంస్థలకు ఈ నేషనల్ ఎడ్యుకేషన్ బోర్డు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సీఐఎస్‌సీఈ చైర్మన్ డాక్టర్ ఇమ్మాన్యుయేల్, సీఈవో సంగీతభాట్యా, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, సెయింట్ జోసెఫ్ స్కూల్ ప్రిన్సిపల్ యు.థెరిస్సా, హబ్సిగూడ కార్పొరేటర్ కక్కిరేని చేతన, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని వసతులు

- ఫిబ్రవరి 1 నుంచి 15 వరకు ప్రాక్టికల్స్
- ఇంటర్ విద్యార్థుల సంఖ్య 1.31 లక్షలు
- జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలకు సంబంధించి అన్నీ వసతులు సమకూర్చడంతో పాటు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశించారు. ఇప్పటి నుంచే ఇంటర్ పరీక్ష కేంద్రాలను క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఇంటర్ పరీక్షల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 28 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ప్రాక్టికల్స్ పరీక్షలు ఫిబ్రవరి 1 నుంచి 15 వరకు రెండు సెషన్లలో జరుగుతాయన్నారు. ఇంటర్‌లో జనరల్, ప్రాక్టికల్స్, ఒకేషనల్ కోర్సులకు పరీక్షలు ఉంటాయన్నారు. ఇంటర్ పరీక్షలకు సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత జిల్లా అధికారులకు సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఎం.కిషన్, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.